

ఆర్. టి. సి. బస్సుస్టాండు. బస్సులు వస్తున్నాయి, వెళుతున్నాయి. దిగేవాళ్ళు దిగుతున్నారు. ఎక్కేవాళ్ళు ఎక్కుతున్నారు. స్కూటర్ ఓ పక్కగా పార్కుచేసి స్టెప్నికి ఆనుకొని నిలుచొని చూస్తున్నాడో యువకుడు. ఇరవై మూడేళ్ళుండవచ్చు. చక్కని విగ్రహం. అల్ట్రా మోడరన్‌గా డ్రెస్ చేసుకున్నాడు. కళ్ళకు రేబాన్ గ్లాసెస్ ఉన్నాయి. బస్సుల్లోంచి దిగేవాళ్ళని పరీక్షగా చూస్తున్నాడు.

"రెడిక్యులస్! బస్సుల్లో దిగే వాళ్లు ఎవరైందీ ఎల్లా తెలుస్తుంది....? మగపెళ్ళి వాళ్ళని ముఖాలమీద రాసుంటుందా? పెళ్ళికని వచ్చిన వాళ్లు ఎక్కడికి పోతారు? నోట్లో నాలిక ఉంటే విడిది ఎక్కడో ఎవరైనా చెప్తారు. ఈ వడిగాపులు ఎవరు

"కాస్తారిక్కడ పీక్కోసం!'' ఆలోచిస్తూ స్కూటర్ స్టార్ట్ చేసి బయలుదేరాడు. బస్సుస్టాండు దాటి మెయిన్ రోడ్డుమీదికి వస్తున్నాడు. ఓ పక్కనుంచి ఓ అంబాసిడర్ హారన్ మోగించుకుంటూ సడెన్‌గా ఆగింది. కాస్తలో తప్పిపోయింది యాక్సిడెంటు! 'ఎటు చూస్తున్నావయ్యా? హారన్ వినిపించటం లేదూ? బ్రేకులు పడకపోతే ఏమయ్యేదీ?' చిరాగ్గా అన్నాడు డ్రైవరు.

'సరాసరి జెయిలుకు వెళ్లేవాడివి!' సూటిగా చూస్తూ అన్నారతను.

'ఆ సంగతి తెలుసుకునే దాకా నువ్వెక్కడ వుండేవాడివి?' అన్నాడు డ్రైవరు.

'ఎక్కువగా పేలాసంటే, ఆ అవకాశం ఏదో నీకే లేకుండా చేస్తా, ఇప్పుడు! ఇంత ట్రాఫిక్ వున్నచోట బుద్ధిలేకుండా అంత స్పీడుగా ఎవరు రమ్మన్నారు?' స్కూటర్ స్టాండువేసి, కారు దగ్గరికి నడిచి డ్రైవర్ ముఖంలోకి తీక్షణంగా చూశాడు. డ్రైవరు సమాధానం చెప్పలేదు. తలవంచుకొని వెనక్కు తిరిగాడు ఆ యువకుడు.

'స్థానబలం! దౌర్జన్యం! గొప్పేముందీ?' కారులోంచి వినిపించాయి మాటలు.

ఆడవాళ్ళ గొంతులా వుంది. మాట్లాడకుండా నిలుచున్నాడు.

'కాదు! న్యాయబలం!!' వెనక్కు తిరిగి దీర్ఘంగా చూశాడు కారులోకి. వెనక సీటులో ఓ రెండు జడలమ్మాయి, మరో ఇద్దరు ఆడవాళ్ళు కూర్చొని వున్నారు. ముందు సీటులో డ్రైవరు పక్కన ఇంకో ఆయన ఉన్నాడు.

'పోనీలే బాబూ! నువ్వే కరెక్టు! యాక్సిడెంటు అయ్యేది కదా అని డ్రైవరు కొంచెం గాభరాపడ్డాడు. దానికోసం దెబ్బలాట దేనికీ? చూస్తే చదువుకున్న వాడిలా ఉన్నావు!' సమాధాన పరిచాడు ఆయన.

'సంస్కారం ఉండాలని ఎక్కడుంది నాన్నగారు?' క్విప్ చేసింది ఆ అమ్మాయి. దోరగా వేగిన జీడిపప్పులా అయింది యువకుడి ముఖం.


'క్షమించండి. ఏదో ఆ మోమెంటులో ఆవేశపడ్డాను. స్థానబలానికీ, దౌర్జన్యానికీ అవకాశం ఏం లేదు! సంస్కారం కొరెడు ఉంది కాబట్టి క్షమాపణ చెప్పుకోడం!!' ఆ అమ్మాయిని క్రీగంట చూశాడు. కింది పెదవి పై పంటితో నొక్కిపడుతూ చూస్తోందామ్మాయి.

'ప్లీజ్ డోంట్ మైండ్! మా అమ్మాయి సరదాగా కామెంట్ చేసింది!' అన్నాడాయన.

'చూడండి సార్! ఈ ఫ్లాట్లో ఆనంద రావు గారట! వారిల్లెక్కడో తెలుసా?' అడిగాడు డ్రైవరు. బెదురుతూ చూశాడు యువకుడు. 'తెలుసు....! వారితో ఏం పనీ?' తడబడ్డాయి మాటలు.

'వాళ్ళమ్మాయి పెళ్ళికదూ? మగ పెళ్ళివారి తాలూకు బంధువులం. పెళ్ళికొడుక్కి పినతండ్రిని అవుతాను. విడిదిలోకి వెళ్ళాలి,' అన్నాడు ఆయన.

## ఆరు నెలల "జ్యోతి" బహుమతి




పై కార్టూనుకు వ్యాఖ్య రాసి 'జ్యోతి' కార్యాలయానికి పంపండి–కార్టూనిస్టు వ్యాఖ్యకు సరిపోయేలాగాని, అతి సమీపంగా ఉండేలాగాని ఉన్న వ్యాఖ్యకు బహుమతి.

---

'నేను తీసుకు వెళ్తా రండి!' డ్రైవర్ని ఫాలో అవుతున్నారు స్కూటర్ వెనక.

'ఏంటో అనుకున్నాంగాని, ఈ వూళ్లో వాళ్ళెంతో మంచి వాళ్లలా కనిపిస్తున్నారు కదండీ నాన్నగారూ?' సాగదీస్తూ అన్నది ఆ అమ్మాయి.

'కాస్సేపు మాట్లాడకుండా వూరుకో అమ్మా!' అన్నాడాయన.

'పాపం! పిలిచి మాకా వచ్చి దారి కూడ చూపెట్టవలసి వచ్చింది. స్కూటర్ పెట్రోలు ఖర్చు మనం భరించడం న్యాయం.' వ్యాఖ్యానించింది ఆ అమ్మాయి.

'వాణీ! నీక్కూడా చెప్పేదీ! ఏమిటా వాగుడు!' తల్లి కాబోలు అన్నది.

కారు విడిది చేరుకోగానే, కారులోంచి అందరూ దిగి విడిదిలోకి నడుస్తున్నారు. అవకాశం చూసి ఓ కాగితపు మడత ఆ అమ్మాయి చేతులో ఉంచి, వేళ్ల నొక్కాడు ఆ యువకుడు.

'నువ్వనుకున్నంత మంచివాళ్లు కాకపో వచ్చు ఈఊళ్లోవాళ్లు!' అంటూ స్కూటర్ మీద వెనక్కు తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

రాణికి వళ్ళు ఝల్లుమన్నది. అతను వెళ్ళిపోయిన వేపు కళ్ళార్పకుండా చూస్తూ నిలుచుంది, 'చాలా డేంజరస్ ఫెలోలా ఉన్నాడే' అనుకొంటూ ఆ కాగితం మడత ఏమిటో విప్పి చూసింది చాటుగా.

'వాణీ...! భగవానుడి సృష్టిలో నీవొక అద్భుత శిల్పకళాఖండం అంటాను. నా రాణిగా మనుగడ నీకు సమ్మతమైతే చెప్పు!

ఇట్లు,
ఒక శాంతి ప్రియుడు!
లేదా,
అహింసావాది!!"

వాణికి ఒళ్ళు మండింది. 'ఈ రౌడీ తనం ఏమిటో నేనూ చూస్తాను. ఈ చీటి తీసుకువెళ్ళి నాన్నగారికిస్తే, అంతు తేల్చుకుంటారు. అందుకే శాంతి ప్రియుడ్నని, అహింసావాదినని అఘోరించాడు. రాణి కావాలిట! రాణి! ఎంతవళ్ళు పొగరో? కవిత్వం కూడ ఒలకబోశాడు వెధవ!! అసలు ఎవరతను? కన్యాదాతగారికి చెప్పి బుద్ధి చెప్పిస్తే...!! విషయం అందరికి తెలిసి అల్లరి పడిపోతాను అనవసరంగా. మళ్ళీ కనిపిస్తే బుద్ధి చెప్పాలి....? స్కౌండ్రల్!" తీవ్రంగా ఆలోచిస్తోంది వాణి.

• •

కన్యాదాత ఆనందరావుగారిల్లు ఓ అల్ట్రా మోడరన్ ప్లాట్! కొత్తగా కట్టిస్తున్నారు. చాలా బావుంటుంది వూరుకు చివర కాబట్టి ఇంటికి ఆనుకొని పెరటి వేపుగా పెద్ద పళ్ళతోట వుంది. తోటలో చాలా రకాల పళ్ళ చెట్లు పూల చెట్లు ఉన్నాయి. ఆనందరావుగారి అమ్మాయి, వాణి పెళ్ళి. ఉన్నవాడు కాబట్టి అట్టహాసంగా చేస్తున్నాడు కూతురి పెళ్లి

ఉదయం ఫలహారాలైయ్యాక, పెళ్ళి కూతుర్ని చూడాలనుకొని విడిదిలోంచి ఓ గుంపు కన్యాదాత గారింటికి బయలు దేరింది. వాణికూడా కాబోయే వదినగార్ని చూడ్డానికి వచ్చింది. పెళ్ళికూతుర్ని అలంకారం చేసి హాల్లో కూర్చోపెట్టారు ఎగ్జిబిషన్‌కోసం! పెళ్లికూతుర్ని చూడ్డం అయినాక ఆమె అంద చందాల్ని గురించి కలో హైటిగా ఇచ్చారు. 'బ్యూటీ క్వీన్' అని కొంతమంది కుర్రాళ్లు. 'రంభ, ఊర్వశి!' అని ఆడ వాళ్ళు! పాటలు కూడా పాడేసి ఆమెను గురించిన వివరాలన్నీ సేకరించారు.

పెళ్ళికూతుర్ని చూడ్డం అయిపోయింది. ఈ గుంపంతా కన్యాదాతగారి ఇల్లు నాలుగు మూలలూ పరిశీలిస్తున్నారు. ఆగ్రాలో తాజ మహల్ దగ్గిర వెంటపడ్డట్టు, కన్యాదాత గారి తాలూకు బంధువులు 'సెల్ఫ్ ఎప్పాయింటెడ్ గైడ్స్'గా వీళ్ళ వెంట వచ్చారు, ఇల్లు చూపించడానికి. ఒంటరిగా వాణి తోటవేపుకు నడిచింది. తోటను మెచ్చుకుంటూ. తోటలో చెట్లు గుబురుగా పెరిగున్నాయి. కాస్సేపు తోట అంతా తిరిగి చల్లగా ఉంటే ఓ చెట్టు కింద కూర్చుంది. కొంచెం దూరంలో ఏదో అలికిడి అయింది! శాంతి ప్రియుడు సడన్‌గా దర్శనం ఇచ్చాడు! వాణి వొళ్ళు ఝల్లుమన్నది! మెల్లగా లేచింది వెళ్ళిపోవడానికి. దారికి అడ్డంగా వచ్చి నిలుచున్నాడు మిష్టర్

శాంతిప్రియుడు.

"మీ ఏకాంతాన్ని భగ్నం చేసినందుకు అన్యధా భావించకండి!....నా కోసం మీరు వెళ్ళిపో నవసరంలేదు.....ప్రకృతి సౌంద ర్యాన్ని ఇంకొంచెంసేపు ఆస్వాదించండి!" అన్నాడు.

"మీకోసం ఏంరాలేదు వెళ్ళిపోవ డానికి!" రుసరుసలాడింది.

"ప్లీజ్. నాకోసం కూర్చోండి! .... పళ్ళు కోసిస్తాను తింటారా?....ఏం పళ్లు కావాలో చెప్పండి!"

"నో! థాంక్స్!! ....నన్ను వెళ్ళ నివ్వండి!" విసురుగా జడ వెనక్కు వేసుకుంది.

"మీరు చాలా కోపంగా ఉన్నారు!.... కారణం తెలుసుకోవచ్చునా?"

"అనవసరం! .... తెలుసుకున్నప్పుడు తెలుసుకుందురుగాని!"

"మీరు కోపంలో ఇంకా అందంగా కనిపిస్తున్నారు!....మీ చెక్కిళ్లు చూడండి. ఎల్లా కందిపొయ్యాయో!"

"మిస్టర్! అధిక ప్రసంగం చాలించి దార్లోంచి అడ్డులేవండి!" తీక్షణంగా చూసింది.

"చెంపకు చారడేసి ఆ కళ్ళు!... ఎంత అందంగా ఉన్నాయో!? .... దోబూచు లాడుతూన్న దోరవయసు! .... ఎంత మత్తెక్కిస్తోందో!" నఖశిఖ పర్యంతం పరిశీలిస్తున్నాడు.

"ఆ పొగరంతా మీ తల్లో ఉందని నాకూ తెలుసు!.... మర్యాదగా నన్ను పోనివ్వండి!....లేదా....!"

"ఏం జరుగుతుందో చూడాలనేఉంది!"

"మీ పరువు, మర్యాద, కాపాడుకోటం కష్టం అవుతుంది! ఇల్లా మరెప్పుడూ ప్రవర్తించకుండా పాఠం నేర్పబడుతుంది" .... బెదిరించింది వాణి.

"ఆ పాఠం ఏదో మీ దగ్గరే నేర్చు కోవాలని ఉంది!....ఈ క్షణం నుంచి నేను మీ ప్రియతమ శిష్య పరమాణువును!!" రెండు చెవులూ పట్టుకొని నిలుచున్నాడు.

వాణికి ఏంచెయ్యాలో తోచలేదు. ఏం చెప్పాలో అర్థంకాలేదు. బెదురుతూ అటూ ఇటూ చూసింది.

"ప్లీజ్! దయఉంచి నన్ను వెళ్లనివ్వండి! ఎవరైనా చూస్తే ఏం అనుకుంటారు చెప్పండి?"

"ఏ. అమ్మాయి, అబ్బాయి అంతరంగిక విషయాలేవో మాట్లాడుకుంటున్నారను కుంటారు!"

"నాన్‌సెన్స్ మీకూ నాకూ సంబంధం ఏమిటి, ఆంతరంగిక విషయాలు మాట్లాడు కోడానికి?"

"చూసేవాళ్లకు ఆ విషయం తెలీదుగా? అయినా సంబంధం కలుపుకుందామనే శ్రమపడుతున్నాను!.... నా అంగీకారాన్ని తెలియపరిచానుకూడ!....మీ అభిప్రాయం కోసమే ఎదురు చూస్తున్నాను!"

"కంటికి నచ్చిన ప్రతీ ఆడపిల్లని రాణిని చేసుకోవాలనుకోడం సభ్యత,

సంస్కారం అనిపించుకోదు ....మీరంటే ఎలాంటి ఇంటరెస్టులేదు. అది నా అభిప్రాయం....లెట్ మి గో!"

"ప్లీజ్, మీ ఇంటరెస్టు ఎవరిమీదో చెప్పండి!"

"అది మీకు అనవసరం!....ఎవరిమీదా ఇంటరెస్టు చూపించే అవసరం నాకులేదు!"

"ఒక్క శ్రీకాంత్ అనే అబ్బాయి తప్ప!....అందుకే మీ మీద జాలికలుగుతోంది!....వాడి సంగతి మీకు తెలిస్తే ఇల్లా మాట్లాడరు....!" ఆమె ముఖంలో మార్పుకోసం చూస్తున్నాడు.

"ఏమయినా ఫరవాలేదు!....నా మంచి చెడ్డలు చూసే ఆత్మీయులు నాకున్నారు.... నేనేం అనాధని కాదు, మీ లాంటి వాళ్ళ సానుభూతి ఆశించడానికి!"

"అంతమంది ఆత్మీయులు ఉండి. ఓ మల్లెపువ్వులాంటి జీవితాన్ని బలిచేస్తున్నారనే నా విచారం!....కాని పుణ్యాత్ముడు దొంగపెంకిఘటం ఆ కర్రి మొద్దుకు మీకు అంటకట్టబోతున్నారని సానుభూతి! అంతే కాదు....మీ మేలుకోరి చెబుతున్నా.. వాడి చరిత్ర ఎవర్నో ప్రేమించాడనికూడా మీకీ విషయం చెప్పడం నా ధర్మం అనుకున్నా!....మాటు అబద్ధాలు అని ఓ ఇల్లు నిలబెట్టేయాలనుకున్నా. వెయ్యి అబద్ధాలైనా చెప్పి ఓ జీవితాన్ని రక్షించుకోవాలని ఉంది పరమార్ధం!....ఇంక మీరు వెళ్లవచ్చు!" జేబుల్లో చేతులుంచుకొని గంభీరంగా ముఖంపెట్టి దోవలోంచి తొలిగాడు.

అడుగులో అడుగువేసుకుంటూ వెళ్లిపోతున్నాడు.

వాణి, దేన్ని గురించో తీవ్రంగా ఆలోచిస్తోంది.

"ఏమండీ ఆగండి!....ఓ విషయం అడుగుతాను దయచేసి చెబుతారా?" ప్రాధేయపడింది.

"చెప్పవలసిన అవసరం నాకేం లేదనుకోండి! అయినా మీరు రిక్వెస్టుచేస్తున్నారు కాబట్టి....పరవాలేదు అడగండి!" బెట్టు సరిచేశాడు.

"శ్రీకాంత్ మీకు తెలుసా?....కన్యాదాతగారు మీకేం అవుతారు?"

"ఆ సన్నాసి తెలియకపోవడం ఏమిటీ! వాడి సంగతి తెలిసినవాళ్ళెవరున్నారు ఈ ఊళ్లో! కన్యాదాతగారితో పెద్ద బంధుత్వం అంటూ ఏంలేదు! మాది ఆ పక్క ఇల్లే. వాడు నా కళ్లముందర పుట్టి పెరిగాడు! ఏదో పెళ్ళికి పిలిచారు వచ్చాను, అంతే! మీకూ శ్రీకాంత్ పెళ్ళియ్యాక బుద్ధి చాలా తెలుస్తుంది. తినబోతూ రుచి అడగడం దేనికి? చూస్తారుగా, ఆ ముచ్చటా ఉంటుంది!"

"మీకేం చేస్తున్నాను?" ఆసక్తితో అడిగింది వాణి.

"కంటికి పచ్చని పెళ్ళాం కనిపిస్తే అన్నీ కొంచెంగా పరిశీలించి చూస్తూంటాను! ఓ స్త్రీని ప్రేమించికూడ చేస్తుందదే!" తన్ను గీరాడు. వాణికి వొళ్లు మండింది.

''కృత్రిమ నాగరికత, సంస్కారాలు చాటుచేసుకొని మానసికంగా పతనం అవుతున్నారు। మీరు చేస్తున్నపని అదని ఎంత తొందరగా తెలుసుకుంటే అంత మంచిది। ఈ రౌడీతనం మీ ఒంటికి అంత మంచిదికాదు।। లింకన్ మహాశయుడు ఏనాడో చెప్పాడు। అందర్నీ అన్ని సమయాల్లో మోసం చెయ్యలేమని। ఈసారి నా మీద ఎడ్వాన్సేస్ తీసుకొన్నారంటే.... డాక్టరూ సహాయంచెయ్యలేడు. జాగ్రత్త! చీదరించుకుంటూ వెళ్ళిపోయింది వాణి ఏన్నుగా ఈలవేస్తూ నిలుచున్నాడు అతను

* * *

శ్రీకాంత్ చెల్లెలు నళిని పెళ్లిసంబంధ కుదిరినప్పుడే వాణిని శ్రీకాంత్‌కు చే కోమని కోరారు. ఈడు జోడు బాగు టుందని బంధుత్వాలు మరింత దగ్గ


CRANE

try a taste of
Nutty
and nice crane....

with crackling flavour—
the NUT
powder known for QUALITY!
so delightfully different—
for leisure and pleasure

Manufacturers: C. B. N. P. WORKS
Agraharam
Guntur-4

తాయని ఆశించారు. నళిని పెళ్ళికాగానే వాణీ, శ్రీకాంత్‌లకు పెళ్ళి చూపులు నిర్ణయించారు.

ఆ రాత్రి నళిని పెళ్ళి లక్షణంగా జరిగి తలంబ్రాలు మంగళ సూత్రధారణ అయినాయి. వధూ వరులకు కట్నాలు చదివిస్తున్నారు చదివింపులు రెండుగంటలసేపు పట్టింది. ఆడపెళ్లివారి తాలూకు ఎవరో వచ్చి పురోహితుడి చెవులో ఏదో చెప్పారు.

'అయితే త్వరగా రమ్మనండి! ఆలశ్యం దేనికి?' అంటూండగా పురోహితుడి చేతికి రిజిస్టరు దస్తావేజు అందించారు ఎవరో.

'నీ అన్నగార్లు రమాకాంతు, శ్రీకాంతు గార్లు నీ ప్రాణిగ్రహణ మహోత్సవ సందర్భాన, నిన్ను ఆశీర్వదించి, నీమీది ప్రేమాదరాభిమానాలతో, వారి పినిమాహాలులో అనగా, అన్నపూర్ణా పిక్చరు పాలెస్‌లో నీకు మూడోవంతు భాగం, సుమారు లక్షన్నర రూపాయల విలువ- చదివించి నటువంటి కానుక!' అంటూ దస్తావేజులు పెళ్ళికూతురికి అందించాడు పురోహితుడు. అందరూ ఆశ్చర్యపోయారు.

'ఆ అపూర్వ సోదరులిద్దర్నీ ఒక్కసారి చూపించండి! ఎల్లా వుంటారో చూస్తాం!' అని మగపెళ్ళివారిలోంచి ఓ గొంతు.

మండపంలోకి రమ్మని అన్నదమ్ములిద్దర్నీ కేక వేశాడు పురోహితుడు.

భార్యా సమేతంగా అక్కడే వున్న కన్యాదాతగారి పెద్దకొడుకు రమాకాంత్‌ని చెయ్యి పట్టుకొని పురోహితుడు అన్నాడు.

'అయ్యా! ఇదిగో ఈయనగారే పెళ్ళికూతురు పెద్దన్నగారు; రమాకాంతంటే, ఇదిగో! ఈమె ఆయన సతీమణి శ్రీమతి ఇందిర! .... ఆ! ఏదండీ శ్రీకాంతు గారు? రమ్మనండి, మగపెళ్ళి వారు చూస్తాం అని ముచ్చట పడుతున్నారు.' అన్నాడు పురోహితుడు.

'మా వాడు కొంచెం సిగ్గుపడుతున్నాడు లెండి! ఫొటో ఒకటి పంపిస్తాం కావాలంటే!' ఆడపెళ్ళి వారిలోంచి ఓ కంఠం పలికింది.

'చెల్లెలికి అంత పెద్ద మొనంగా కట్నం చదివించిన, ఆయనకు సిగ్గెందుకు? ధాతి విరుచుకుని రావాలిగాని!' మగపెళ్ళి వారిలోంచి ఓ గొంతు.

తండ్రి పక్కనే కూర్చుని పెళ్లివంది రంతా పరికించి చూస్తోంది వాణి ఆమె కళ్ళు ఆత్రంగా ఎవరికోసమో వెదుకుతున్నాయి. కన్యాదాతగారి రెండో అబ్బాయి శ్రీకాంత్ ఎల్లా వుంటాడో చూసే అవకాశం వస్తోంది. శాంతిప్రియుడు చెప్పినదాన్నిబట్టి మనిషి బాగుండడని అర్థం అయింది ఎంత అనాకారిగా వుంటాడో, కాస్త అయినా సరిపెట్టుకొనేలా వుంటాడో లేదో అని ఆందోళన పడుతోంది. ఆమెకు చెమటలు పోస్తున్నాయి. గుండె వేగంగా కొట్టుకుంటోంది.

పందిరి స్తంభానికి కట్టిన అరటిబోదుల

చాటున నిలుచోని వాణి పరిస్థితిని చూస్తూనే వున్నాడు శ్రీకాంత్. చిరునవ్వుతో మంటపంలోకి నడిచాడు పురోహితుడి దగ్గరికి.

'అయ్యా! ఇదిగో. వీరే శ్రీకాంత్ గారంటే! పెళ్ళి కుమార్తె రెండో అన్న గారు. బాగా చూడండి రెండు కళ్ళూ పెట్టుకోని. బ్రహ్మాండమైన సరుకు. ఈ జిల్లాంతా వెతికినా దొరకడం కష్టం,' అంటూ శ్రీకాంత్ బుగ్గ గిల్లాడు పురోహితుడు. అందరూ ఘొల్లుమన్నారు. శ్రీకాంత్‌ని చూడగానే ఉలిక్కిపడింది వాణి. విభ్రాంతురాలై కళ్ళార్పకుండా చూస్తోంది అతనివేపు. వణుకుతూన్న పెదవుల్లోంచి ఓ చిరునవ్వు ఉదయిస్తోంది. కాటుక కళ్ళల్లోంచి ఆనందబాష్పాలు కాలువలా చెక్కిళ్ళమీదుగా జారుతున్నాయి. ఆమె హృదయంలో పన్నీటి జల్లులు వెల్లువలై పారుతున్నాయి. శ్రీకాంత్‌ని తనివితీరా చూస్తోంది. ఆ శాంతప్రియుడే ఈ శ్రీకాంత్ అని తెలుసుకొంది.

శ్రీకాంత్ వాణివేపు నవ్వుతూ చూశాడు.

'నేను వస్తే కన్వల్షన్స్ ఎఫెక్ట్ అయ్యే పేషంట్స్ ఉన్నారు మీలో. అందుకే రాలేదు!' అన్నాడు శ్రీకాంత్.

'మీరే వైద్య సహాయం చెయ్యొచ్చుగా! వదులుతోంది ఆగేనా?' మగపెళ్ళి వారిలోంచి అన్నారు ఎవరో.

'ఆమె ప్రస్తుతం సైక్యాట్రిస్టుకు సంబంధించిన కేసు! గైనోకాలజీ కిందికి దిగినప్పుడు కేసుని నేనే తీసుకుంటాను,' అన్నాడు శ్రీకాంత్. అందరూ వాణిని చూసి నవ్వుతూంటే ఇంకా అక్కడ ఉండకుండా లేచి పారిపోయింది.

* *

మర్నాడు వాణికీ, శ్రీకాంత్‌కు పెళ్ళి చూపులు జరిగాయి. పెద్దలు తాంబూలాలు పుచ్చుకున్నారు. వాణిని తన రాణిగా చేసుకునేందుకు పెద్దలు అనుమతించి ఇచ్చిన 'ప్రొవిజినల్ లైసెన్సు' ఆ తాంబూలాలు అనుకున్నాడు శ్రీకాంత్.

ఆ సాయంకాలం గుట్టుచప్పుడు కాకుండా వాణిని నది ఒడ్డుకు షికారు తీసుకు వెళ్ళాడు శ్రీకాంత్. అందుకు ఇందిర పర్మిషన్ ఇచ్చింది.

'చీకటి పడకుండా త్వరగా వచ్చెయ్యండి! తెలిస్తే బాగుండదు. పెళ్ళి కాకుండా ఈ షికార్లేమిటి అంటారు!' హెచ్చరించింది ఇందిర.

ఇసుకలో నీటి ఒడ్డున కూర్చున్న వాణి చెంపలమీదికి నీరెండ పడుతోంది. ఇంద్రధనుస్సులా మరింత అందంగా కనిపిస్తోంది వాణి.

'వాణీ! నీ ఇంటరెస్టు ఎవరి మీదో ఇప్పుడు చెప్పు,' అన్నాడు శ్రీకాంత్.

జవాబు చెప్పకుండా రెండు అర చేతుల్లో ముఖం దాచుకుంది వాణి.

'ఇల్లా చూడు వాణీ!'

తల అడ్డంగా ఊపింది చూడనన్నట్లు.

'మాటలు రావా నీకు? తోటలో దబాయించావుగా?'

కళ్ళతో చిలిపిగా వెక్కిరించింది.

'నీ ఇంటరెస్టు ఎవరిమీదో చెప్పు. వింటాను.'

'....శాంతి ప్రియుడిమీద,' అన్నది.

'మరి నీ బుగ్గలు అల్లా ఎరుపెక్కాయి దేనికి!'

'శాంతి ప్రియుడి రాణిని కాబోతూన్నందుకు.'

'అయితే వాడితోనే వెళ్ళిపో. నన్నెందుకు చేసుకుంటానన్నావ్?'

'....కరి మొద్దుకన్నా నయం కదూ?' చిరునవ్వుతో చూసింది. 'శాంతిప్రియుడు కృత్రిమ నాగరికత, సంస్కారాలు గలవాడు కదూ?' అతని పెదవులకు చూపుడువేలు అడ్డుపెట్టింది మాట్లాడనీయకుండా.

'ఇంత దొంగనాటకం ఎందుకాడారో ముందు చెప్పండి.'

'నిన్ను అన్ని కోణాల్లోంచి చూస్తే ఎల్లా వుంటావో తెలుసుకుందామని.'

'అల్లాగేం....? నేను కాబట్టి ఊరుకున్నాను. ఇంకోళ్ళయితేనా...'' అన్నది వాణి. వెంటనే వాణిని దగ్గిరిగా తీసుకొని ముద్దు పెట్టుకున్నాడు. 'ఇల్లాగే జరిగి వుండేది!' అంటూ,

రాలేదని ఇందిర కారు తీసుకుని బయలుదేరింది. అడుగులో అడుగు వేసుకుంటూ ఇంటివేపు నడుస్తున్నారు ఇద్దరూ. ఇందిర కారు సూటిగా తీసుకు వెళ్లి ఎదురుగా ఆపింది.

'ఏమ్, అమ్మాయి! చెప్పకుండా చెయ్యకుండా మా మరదిని ఎక్కడికి తీసుకువెళ్లావు?'' దబాయించింది యిందిర.

''నాకేం తెలీదు....ఎవర్ని ఎవరు తీసుకువెళ్లారో మీ మరిదినే అడగండి!'' మళ్లీ దబాయించింది వాణి.

కారు లైట్ల వెలుతురులో శ్రీకాంత్ ముఖంలోకి చూసి నవ్వింది. ఇందిర. ఒదిన ఎందుకు నవ్వుతుందో అర్థంకాలేదు అతనికి. వాణి ముఖంలోకి చూశాడు ప్రశ్నార్థకంగా. వాణి అపరిమితంగా సిగ్గుపడిపోయింది.

''ఇల్లా రండి ఓ సారి.'' అంటూ పమిట చెంగుకు ఆవిరిపట్టి అతని పెదవుల్ని చెంపల్ని తుడిచింది వాణి!!

''ఫరవాలేదులే వాణీ! అంతవరకేగా?'' నవ్వుతూ అన్నది ఇందిర.

''ఫో అక్కా! నీవు మరీను!!'' అంటూ వెళ్ళి కారు ఎక్కింది వాణి.

''ఎంతైనా....వాణి నా రాణేగా!?' అన్నాడు శ్రీకాంత్.

''అయితే ఇంటికి పద! నీ వీపు రిపేర్ చేయిస్తాను!'' శ్రీకాంత్ చెవి పట్టుకొని కారులోకి ఈడ్చుకుపోయింది ఇందిర.